క్లుప్తంగా

ఘనంగా వారాహీదేవి నవరాత్రులు

గుడివాడటౌన్: స్థానిక వాసవీచౌక్ సెంటర్‌లో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ వారాహీదేవి నవరాత్రి మహోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత వారాహీదేవికి అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, నవగ్రహ అష్టదిక్పాలక, పంచలోకపాలక, మండప ఆరాధనలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారాహీదేవిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సీహెచ్ గోపీశర్మ, ఆలయ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

గుడివాడటౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యుడు మల్లంపల్లి వెంకట్రావు సౌజన్యంతో బాలింతలకు కిట్లు, రోగులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎస్.శేషగిరిరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ఇందిరాదేవి, క్లబ్ సభ్యులు ఆర్.వేణుబాబు, ఎం.వీరశేఖర్, పి.కేశవరావు, వైవీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు...

పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య కల్యాణ మండప నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణ ఆర్యవైశ్య ప్రముఖుడు మద్ది మోహనరావు జయంతి వేడుకలు నిర్వహించారు. మోహన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పోకూరి మోహన్‌రావు, తిరివీధి శ్రీరాములు, జవ్వాజి గంగరాజు, కొనకళ్ల సీతయ్య, బొగ్గరపు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు...

శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక నాగవరప్పాడు లోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాల చిన్నారులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. యాదవ సేవాసంఘం సభ్యుడు, శివ ఇంటీరియర్స్ అధిపతి ఎం.శివ సౌజన్యంతో పుస్తకాలు పంపిణీ చేశామని సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సయ్యద్ జబీన్, సయ్యద్ గఫార్, బొగ్గరపు తిరుపతయ్య, కె.నాగమణి, కె.హరిబాబు, జాజుల తాతారావు, సత్యం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి

కైకలూరు: విద్యార్థులలో నైపుణ్యాలను పెంచడానికి ఉపాధ్యాయులు నూతన పద్ధతులను అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. కైకలూరు ఎంఈవో కార్యాలయంలో సమగ్ర శిక్ష టీచ్ టూల్ క్లాస్ రూమ్ అబ్జర్వర్స్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. శిక్షణలో నేర్చుకున్న పలు అంశాలపై ప్రధానోపాధ్యాయులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి కేంద్రీకృతంగా మనమందరం పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరే విధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలను అందిస్తోందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం వద్ద డీఈవో వడ్డన చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.రామారావు, వి.శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్స్ సీహెచ్.సారథి, ప్రభుదాస్, వెంకట కృష్ణ, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



కైకలూరు: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి బీజేపీ కార్యకర్త నడుచుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు క్యాంపు కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి కూటమి నాయకులతో కలిసి శనివారం ఆయన నివాళి అర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వేంపాటి విష్ణురావు, కోటప్రోలు కృష్ణ, కీర్తి వెంకట రామప్రసాద్, కేవీఎస్ఎం నాయుడు, బొల్లా శ్యామలరాజు, కట్టా వీరరాఘువులు, జానీ, తులసి పూర్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నా క్యాంటీన్ వద్ద మాజీ ఎంపీటీసీ పైడిమర్రి రాధాకృష్ణ ఆర్థిక సాయంతో ఉచిత భోజనాలను అందించారు.

వర్ల గెలుపుతో పామర్రు అభివృద్ధి

పమిడిముక్కల: శాసనసభ్యుడిగా వర్ల కుమార్ రాజా ఎన్నికవడంతో పామర్రు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవనుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శనివారం ఉయ్యూరు వెళ్లి మర్యాదపూర్వకంగా రాజేంద్రప్రసాద్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని రాజాకు విజ్ఞప్తి చేశారు. మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అజ్మతుల్లా, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణికుమార్ పాల్గొన్నారు.

రేబిస్ టీకాతో జంతు సంబంధ వ్యాధుల నుంచి రక్షణ

పామర్రు: మానవాళికి జంతువుల నుంచి వ్యాప్తి చెందే వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు వాటికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌లను వేస్తున్నామని పశుసంవర్ధక శాఖ ఏడీ చిమటా శశికుమార్ అన్నారు. స్థానిక పశువైద్యశాలలో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చి కుక్క కాటు ద్వారా మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వ్యాధి రేబిస్ అని చెప్పారు. ఈ వ్యాధి కుక్క చొంగ ద్వారా కూడా వ్యాప్తి చెందుతుందన్నారు. రకరకాల కుక్కలకు ఈ టీకాలను వేశామని, వీటిలో లాబ్రిడరీ జాతి, ఫగ్, జర్మన్ షప్పార్డు, ల్యాబ్, ఫవిచ్‌మన్ తదితర జాతులకు చెందిన కుక్కలు ఉన్నాయన్నారు. గ్రామాలలోని వీధి కుక్కలను పంచాయతీ వారు తీసుకువస్తే వాటికి కూడా ఈ వ్యాక్సిన్ వేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జంతువుల నుంచి మనిషికి సోకే వ్యాధులు రేబిస్, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్, క్షయ, ఫాక్స్, లెప్టోస్పైరోసిస్, మెదడువాపు, తామర వంటివన్నారు.

యజమానులు పాటించాల్సిన నియమాలు

కుక్కలు ఉండే ప్రదేశాన్ని క్రమం తప్పకుండా క్రిమి సంహారక ద్రావణంతో శుభ్రపరచాలన్నారు. కుక్క పిల్లలకు ఆరు నెలల వరకు నెలకోసారి, ఆరు నెలల తర్వాత మూడు నెలలకు ఓసారి డీ వార్మింగ్ మందులను వేయించాలన్నారు. కుక్కలకు ఉడకపెట్టిన మాంసం, చేపలను మాత్రమే ఇవ్వాలని, కుక్కలకు వాడే పాత్రలను క్రిమి సంహారక ద్రావణంతో శుభ్రపరిచి, పిల్లలకు అందకుండా ఉంచాలన్నారు. వ్యాధిగ్రస్త కుక్కలను హ్యాండిల్ చేసే సమయంలో చేతులకు గ్లవ్స్, ముఖానికి మాస్క్ , కళ్లకు అద్దాలు వాడాలన్నారు. కుక్కలకు రేబిస్, లెప్టోస్పైరోసిస్ వంటి వ్యాధులు రాకుండా రెగ్యులర్‌గా టీకాలు వేయించాలని, నట్టల నివారణ మందును కుక్కలకు తప్పని సరిగా వేయించాలన్నారు. ఈ సందర్భంగా 90 కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్, డీవార్మింగ్ మందులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది కేఎస్ కోటిరెడ్డి, బాషా, సాయివర్ధన్‌రెడ్డి, గోపి స్థానికులు పాల్గొన్నారు.



కైకలూరులో పెంపుడు కుక్కకు రేబిస్ వ్యాక్సిన్ అందిస్తున్న ఏడీ ముస్తఫా ఖాన్

జమీదగ్గుమిల్లిలో

మండలంలోని జమీదగ్గుమిల్లి పశువైద్యశాలలో పశువైద్యుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు.

మండవల్లిలో ఉచిత రేబీస్ వ్యాధి టీకాలు

మండవల్లి: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని మండలంలో శనివారం 162 కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ డీవీ వరప్రసాద్ తెలిపారు. కుక్కల పెంపకందార్లకు జూనోటిక్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులు రేబిస్, మెదడు వాపు, ఆంత్రాక్సు, బ్రూసెల్లోసిస్, టీబీ, బర్డ్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూ తదితర వ్యాధుల వ్యాప్తి నివారణపై అవగాహన కల్పించారు. ఉచిత రేబిస్ టీకాలను వారం పాటు కొనసాగిస్తామని, పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

341 పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సిన్

కైకలూరు: జంతువుల నుంచి సంక్రమించే జూనోటిక్ వ్యాధులపై పెంపుడు జంతువుల యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పఠాన్ ముస్తఫా ఖాన్ చెప్పారు.



పామర్రులో కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను వేస్తున్న ఏడీ చిమటా శశికుమార్

ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా కైకలూరు పశువైద్యశాల వద్ద ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు జూనోటిక్ వ్యాధుల నివారణపై శనివారం అవగాహన కలిగించారు. జంతువుల నుంచి సంక్రమించే రేబిస్, మెదడు వాపు వ్యాధి, బర్డ్‌ఫ్లూ, బ్రూసెల్లా, సాల్మోనెల్లా, లెప్టోస్పైరోసిస్, క్షయ, దొమ్మరోగం, ధనుర్వాతం వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పెంపుడు జంతువులను పెంచుతున్నప్పుడు కచ్చితంగా వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. అనంతరం కైకలూరు, కలిదిండి మండలాల్లో కైకలూరు, శీతనపల్లి, గుమ్మళ్ళపాడు, కోరుకొల్లు, సానారుద్రవరం, భాస్కరరావుపేట పశువైద్యశాలల్లో మొత్తం 341 పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్ అందించారు. మరో మూడు రోజులు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఏడీ చెప్పారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ జువాలజీ అధ్యాపకులు డాక్టర్ ఎం.విజయకుమార్, డాక్టర్ వి.సంధ్య, పశువైద్యులు గణేష్, లీలా ఉషా రాణి, మహమ్మద్ బాజీ, షేక్ ఘని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ముదినేపలిరూరల్: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉంటూ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి అన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వినియోగం వల్ల చేకూరే అనర్థాల గురించి వైష్ణవి ఆధ్వర్యంలో మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత పెడదారి పడితే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైష్ణవి, ప్రధానోపాధ్యాయుడు బి.ప్రభుదాస్, సీనియర్ ఉపాధ్యాయులు సీహెచ్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ అంబుల మనోజ్, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించండి

డీవైఈవో పద్మారాణి

పమిడిముక్కల: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గుడివాడ డీవైఈవో పద్మారాణి తెలిపారు. వీరంకిలో శనివారం బడికి పోదాం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేదసుప్రజ, ఎంఈఓ-2 శ్రీనివాస్, హెచ్‌ఎం గాయత్రీదేవి, ఉపాధ్యాయుడు వీరంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్జీవన్ ఆశయసాధనకు కృషిచేయాలి



పామర్రులో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



పామర్రులో జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కైకలూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డీఎన్నార్, జయమంగళ, బీవీ రావు

వర్ల కుమార్ రాజా, పామర్రు ఎమ్మెల్యే

పామర్రు: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. జగ్జీవన్ వర్ధంతి సందర్భంగా పామర్రులోని టీడీపీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటం, చాట్లవానిపురంలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి శనివారం ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, టీడీపీ, జనసేన నాయకులు వల్లూరిపల్లి గణేష్, కోటి పాండురంగారావు, మండపాక శంకరబాబు, వెంకటేశ్వరరావు, బీఏఎం లాజరస్, చాట్ల పున్నమ్మ పాల్గొన్నారు. కూడలి వద్ద కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు విశ్రాంత బ్యాంక్ మేనేజర్ రాయవరపు బాబు రాజేంద్రప్రసాద్, దళిత గిరిజన హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాయవరపు వెంకటేశ్వరరావు, అరుంధతి సేవా మండలి రాష్ట్ర అధ్యక్షుడు పెదపూడి కాంతారావు, జువ్వనపూడి సురేంద్ర, గుర్విందపల్లి నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో...

స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు టి.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, ఎ.శ్రీనాథ్‌రెడ్డి, తిరుమలశెట్టి వాసు, చాట్ల అంజి, ఎం.అంజిరెడ్డి, నత్తా నాని, కుందేటి రాణి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి

తోట్లవల్లూరు: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలను ఎనలేనివని తోట్లవల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు పీఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యాన బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి శనివారం ఘనంగా జరిగింది. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ పెనుమత్స రాధిక పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, వైస్‌ఎంపీపీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

గుడివాడ టౌన్: దళితుల అభ్యున్నతికి కృషిచేసిన గొప్ప నాయకుడు బాబూ జగ్జీవన్ రామ్ అని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. స్థానిక గుడ్‌మెన్ పేటలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి శనివారం వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కంచర్ల సుధాకర్, విక్టర్ పాల్, వేల్పుల నాగబాబు, వేశపోగు సుందరయ్య, అత్తాటి సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో...

ముదినేపల్లి రూరల్: మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాలు మండలంలో శనివారం జరిగాయి. దళిత సంఘాల కార్యాలయంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్‌బాబురావు, మాదిగ దండోరా ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కత్తి రాజు, మరియదాసు, చినబాబు, ఏసేబు, వంశీ, యోహాను, కోటేశ్వరరావు, తోటకూర మరియదాసు, ప్రదీప్, ఇమ్మానియేలు, ప్రకాష్ పాల్గొన్నారు. శ్రీహరిపురం శివారు చేవూరుపాలెంలో దళిత సంఘాల నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

కైకలూరు: భారతదేశ చరిత్రలో ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం జాన్‌పేటలో విగ్రహానికి వారు నివాళి అర్పించి స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ పట్టపు బాలమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బీవీ రావు, సింగంశెట్టి రాము, కన్నా రమేష్, తమ్మిశెట్టి కొండ, సిద్ధాబత్తుల శ్రీరామమూర్తి, కుమ్మరిగుంట మదన్, నర్రా ప్రభు, సువర్ణ రాజు పాల్గొన్నారు. జాన్‌పేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, గ్రామపెద్ద తలారి జాన్, కూటమి నాయకులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, కొల్లి బాబీ, పూలా రాజీ తదితరులు నివాళులర్పించారు.

పమిడిముక్కలలో...

పమిడిముక్కల: స్థానిక ఎస్సీ కాలనీలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి సర్పంచ్ ముళ్లపూడి సునీత, టీడీపీ నాయకులు నాదెళ్ల సుబ్రమణ్యం, పరసా సిల్వబాబు, ముళ్లపూడి శ్రీనివాసరావు నివాళులర్పించారు.

భట్లపెనుమర్రులో...

భట్లపెనుమర్రు(మొవ్వ): జగ్జీవన్ రామ్ వర్ధంతి శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భట్లపెనుమర్రు గ్రామ మాజీ సర్పంచ్ కొడాలి దయాకర్, తరగటూరి నాని, పెనుమత్స నాగరాజు, పెనుమత్స నాంచారయ్య, విశ్వనాథపల్లి రత్నం, కొడాలి శ్రీను, చీలి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

బల్లిపర్రు(పామర్రు): ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని బల్లిపర్రు గ్రామంలో విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను శనివారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో పలు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని, వాటిని అరికట్టేందుకు అందరూ తగు జాగ్రత్తలు వహించాలని అన్నారు. గ్రామంలోని డ్రైనేజీలు అధ్వానంగా ఉండటంపై అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు. వైద్యులు, పంచాయతీ సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. అశ్రద్ధ చూపితే వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదన్నారు. పని తీరు మార్చుకుని ప్రభుత్వానికి అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమలలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, స్థానిక నాయకులు సుధాకర్, స్వర్ణలత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

జాతీయ సదస్సులో గుడ్లవల్లేరు ఫార్మసీ కళాశాల ప్రతిభ

గుడ్లవల్లేరు: ఏపీ అకాడమీ ఆఫ్ సైన్సెస్, కృష్ణా విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ నెల 3వ తేదీన నూజివీడు శ్రీ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన జాతీయ సదస్సులో గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల అధ్యాపకురాలు, విద్యార్థులు విజయం సాధించారు. ఈ విషయాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు శనివారం విలేకరులకు తెలిపారు. తమ కాలేజీ అధ్యాపకురాలు జి.శ్యామల ఓరల్ ప్రజెంటేషన్స్‌లో ప్రథమ స్థానం, బీ ఫార్మసీ నాల్గవ సంవత్సర విద్యార్థులు ఎం.జోషిత, డి.గాయత్రి, ఇ.జగదీష్ ద్వితీయ స్థానాన్ని సాధించారన్నారు. విజేతలను ప్రిన్సిపాల్ లక్ష్మణరావుతో పాటు అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కే అమీనాబీ, డాక్టర్ పి.రవీష, డాక్టర్ టి.ప్రశాంతి, డాక్టర్ బి.మోహన్‌గాంధీ, డాక్టర్ బాలకృష్ణ, బి.సత్యశ్రీ, టి.శ్రావణి, వి.ఎల్.వినోద్‌కుమార్, కె.పరిమళ, డాక్టర్ వి.రజని అభినందించారు.



ప్రథమ స్థానాన్ని అందుకున్న అధ్యాపకురాలు శ్యామల

మాజీ సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శనివారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల పర్యటనకు బయలుదేరిన జగన్‌ను గన్నవరం విమానాశ్రయం వద్ద కలిసి అభివాదం చేశారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటానని జగన్ భరోసా ఇచ్చినట్లు అనిల్ తెలిపారు.



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అభివాదం చేస్తున్న పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

సంక్షిప్త వార్తలు

రేపు కైకలూరులో వైఎస్ జయంతి

కైకలూరు: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకను సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) శనివారం చెప్పారు. ఉదయం 8 గంటలకు కైకలూరు సంత మార్కెట్ వద్ద 23 అడుగుల వైఎస్ విగ్రహం వద్ద జయంతి వేడుకను నిర్వహిస్తున్నామని, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తప్పక విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

పమిడిముక్కల: పెనుమత్స ప్రాథమికోన్నత పాఠశాలలో దాత మొవ్వ రాము ఆర్థిక సహాయంతో శనివారం విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. దాత మొవ్వ రాముతో కలిసి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం వైద్యశాఖ సిబ్బందితో కలిసి స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దండమూడి అచ్చమాంబ, డీవైఈవో పద్మారాణి, ఎంఈఓ శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో కలాసుమాలపల్లి, కనకదుర్గమ్మ కాలనీ ప్రాంతాలలో శనివారం సర్పంచ్ పెనుమత్స రాధిక రహదారుల వెంట, మురుగు నీరు నిలువ ఉన్న ప్రాంతాలలో పారిశుద్ధ్య సిబ్బందితో బ్లీచింగ్, సున్నం చల్లించారు. దోమల నిర్మూలనకు దోమల మందు కూడా పిచికారీ చేయించనున్నట్లు చెప్పారు.

యాచకులకు వైద్య పరీక్షలు

గుడివాడటౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మందపాడులోని యాచకుల నైట్ షెల్టర్‌లో యాచకులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ కె.జోగేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. క్లబ్ కార్యదర్శి కె.రామారావు, కోశాధికారి కె.రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు ఈనెల 10 వరకు గడువు

పామర్రు: ఉయ్యూరులో సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్, ఎడ్యుకేషన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏజీ అండ్ ఎస్‌జీ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం వివిధ కోర్సులలో చేరుటకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 10వరకు గడువు ఉందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వివిధ కోర్సులలో అడ్మిషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కళాశాలలోనే ప్రారంభించామని తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి అయిన విద్యార్థులు డిగ్రీలో చేరుటకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థులు తమ వెంట 6 నుంచి 10 వ తరగతి వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్, 10వ తరగతి మార్కుల లిస్టు, ఇంటర్ మార్కుల లిస్టు, స్టడీ సర్టిఫికెట్లు, క్యాస్టు సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఇన్‌కం సర్టిఫికెట్, ఓపీటీ కోసం మొబైల్ ఫోన్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలను తీసుకురావాలన్నారు. ఇతర వివరాల కోసం అడ్మిషన్ కమిటీ సభ్యులు ఎన్.వసంతరావు 98492 44585, ఏఎన్ శ్రీనివాసరావు 95535 39203 నంబర్లను సంప్రదించాలన్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలి

మొవ్వ: ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డీలర్లు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల సూచించారు. శనివారం మొవ్వ, ఘంటసాల మండలాల ఎరువుల, పురుగు మందుల, విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అమ్మకాల వివరాల రికార్డులు సక్రమంగా ఉంచాలని, షాపులో లైసెన్సు, షాపు గోడవును వివరాలు డిస్‌ప్లే చేయాలని సూచించారు. ఎరువుల అమ్మకాలు ఈ-పాస్ మిషన్ ద్వారా చేయాలని, అధిక ధరలు అమ్మినా, ఉద్దేశపూర్వకంగా రైతులను ఇబ్బంది పెట్టినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏవోలు కె.శివప్రసాద్(మొవ్వ), కె.మురళీ కృష్ణ(ఘంటసాల)పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై అసంతృప్తి

మండవల్లి: అధికారులు, వార్డు సభ్యులు హాజరుకాని గ్రామసభల వల్ల సమస్యలు పరిష్కారం కావని, గ్రామసభలతో ప్రయోజనం లేదని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల కార్యదర్శి టి.అప్పారావు అన్నారు. స్థానిక నాగేంద్రస్వామి కల్యాణ మండపంలో, సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. నేషనల్ హైవే పక్కన వేసిన పైప్ లైన్ ద్వారా నీరు అందడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. పలువురు మండల స్థాయి అధికారులు హాజరుకాకపోవడం, 12 మంది వార్డు సభ్యులకు నలుగురే హాజరుకావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణ నిధులు రూ.99,605, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3,58,979 ఉన్నట్లు కార్యదర్శి టి.శ్రీనివాసరావు ప్రకటించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, వీఆర్వో కమలహాసన్, పశు సంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్, విద్యుత్, పీఆర్ ఏఈలు సత్యనారాయణ, కమల్‌రాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఒక స్థాయి వరకే రిజర్వేషన్ ఉండాలి

గుడివాడటౌన్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ అమలులో మార్పులు జరిగినప్పుడే వాటి ఫలితాలు సామాన్యునికి అందుతాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొంది వివిధ కేడర్లలో ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థాయిలో ఉన్నవారు సైతం వారి పిల్లలకు ఎస్సీ రిజర్వేషన్ అనుభవించడం వలన సామాన్యులకు వాటి ఫలాలు అందటం లేదన్నారు. వివిధ కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో తమ పిల్లలకు ఉత్తమ శిక్షణ ఇస్తున్న నేపథ్యంలో వారు సైతం రిజర్వేషన్ ద్వారా ఉద్యోగాలు పొందుతున్నారు. తద్వారా సామాన్య దళితుడు రిజర్వేషన్ ఫలాలు పొందలేకపోతున్నారన్నారు. ఆర్థికంగా స్థిరపడి ఉన్నత ఉద్యోగాలు అనుభవిస్తున్న వారి పిల్లలకు రిజర్వేషన్ అమలు చెయ్యకుండా సామాన్యులకు వాటిని అమలుచేస్తే ఆర్థిక అసమానతలు తొలగిపోతాయన్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి దిలీప్ కుమార్‌తో పాటు గుడివాడ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నేత కనగాల పవన్ పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ముదినేపలి రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించాలని డ్వామా పీడీ ఎ.రాంబాబు, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఈ పథకానికి సంబంధించి మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగింది. మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల్లో జరిగిన పలు అంశాలకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించి సీఆర్పీలు నివేదికలు సమర్పించారు. దీనిపై పీడీ, ఎంపీపీ మాట్లాడుతూ సామాజిక తనిఖీ ప్రజావేదికలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. విధి నిర్వహణలో అలసత్వం చూపకుండా, పొరపాట్లు జరగకుండా సరిదిద్దుకోవాలన్నారు. పథకం ప్రతి ఒక్కరికీ చేరువ కావాలని, దీని ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించే విధంగా క్షేత్ర సహాయకులు కృషి చేయాలన్నారు. పథకం పనుల్లో నైపుణ్యత ఉండడంతో పాటు అవినీతికి ఎక్కడా తావులేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో గంగాధరరావు, ఏపీడీ సుధాకరరావు, సోషల్ ఆడిట్ డైరెక్టర్, ఎస్సార్పీలు, వీఆర్పీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

కైకలూరు: గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ సెక్రటరీ రవికిరణ్ చెప్పారు. భుజబలపట్నం గ్రామంలో శనివారం దోమల నివారణకు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఫాగింగ్ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ సబ్ యూనిట్ ఆఫీసర్ పీఎస్ఎస్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది చక్రపాణి, నాగేశ్వరమ్మ, బుంగా కీర్తి, ఇంజనీరింగ్ అసిస్టెంటు సాయితేజ పాల్గొన్నారు.

హెల్మెట్లు లేకుండా వాహనాలు నడపొద్దు

కైకలూరు: ప్రాణం ఎంతో విలువైనదని, వాహనదారులు హెల్మెట్లు లేకుండా వాహనాలు నడపవద్దని కైకలూరు టౌన్ పోలీసులు సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో స్టేషన్ వద్ద వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై శనివారం అవగాహన కల్పించారు.